



# శరీరపు గుర్తు పొడి అక్షరాలేనా?

—శిలాలోలిత

చాలా సేపట్నించీ ఎదురు చూస్తూనే వున్నాను. వేనెక్కవలసిన బస్సింకా రావడం లేదు. ఎంతకీ రాదు. అసలొస్తుందా? రాదా? అన్నీ ప్రశ్నలే—




"హలో...మీ పేరేమిటి"–

ప్రశ్నించిన దిక్కునైపు చూశాను. జలపాతం లాంటి అమ్మాయి. నవ్వుల్తో పోటీ పడ్తూ దుమికే ఆనందపు ఛాయలు ఆమె మొహంలో!

"పేరా! నాదా!"–

విస్మయం నా గొంతులో.

ఔన్నా పేరేమిటి? ఇవ్వడెందుకు? అసలు పేరుందా నాకు? దానికో విలువుందా, పేరుకున్న పొడి అక్షరాలే మనిషి గుర్తులా? అక్షరాల రంగు అద్దకపోతే నేనేం కానా? నేనంటే, ఔన్నే నంటే– నాలో అలల్లా విరిగి పడ్తున్న శబ్దాల హోరు.

"ఏంటండీ? పేరేంటంటేనే అంత ఆశ్చర్య పోతున్నారు? మర్చిపోయారా? పేర్లేదా?"

కొంటెతనం ప్రశ్నలో– ఆశ్చర్యం మొగంలో–

"ఏ పేరు? గుర్తుకు రావడం లేదు"–

నా గొంతు నుంచి పెనుగులాడ్తూ పెనగులాడ్తూ వచ్చిందా మాట.

షాక్ కొట్టి నట్లయిందామెకి–

ఆమె కళ్లల్లోంచి కుతూహలం కట్టలై ప్రవహించింది.

ఇంతలో 158 నెంబర్ బస్సొచ్చింది.

ఈగలు, దోమలు, పందులూ, కాట్ల కుక్కలూ లాంటి రకరకాల జంతు ప్రవేశం చేసిన మనుషులు బస్సెక్కడమనే యుద్ధం మొదలెట్టారు. శరీరాన్ని నేను కూడా బలవంతంగా జరిపి, నేను నడవకుండానే తోస్తూంటే వచ్చి ఒక సీట్లో కూలబడ గల్గాను. ఒక గంటన్నర పాటు బస్సు ప్రయాణమిక. బస్‌పాస్ పుణ్యమా అని కండక్టర్ని వెతుక్కోనక్కర్లేదు. ఈ సంవత్సరం మొత్తం మీద సీటు అనే మహా భాగ్యాన్ని సంపాదించుకోగలిగిన మొదటి రోజిది.

నిశ్శబ్దంగా వున్న నీటి మొహం మీద అలల చేతుల్తో కొట్టిన చెంప దెబ్బలా వుంది ఆ అమ్మాయి అడిగిన ప్రశ్న– కళ్లు మూసుకున్నాను. సీటుకు జారగిలబడి– నాలోని చీకటిలోకి మనస్సు ప్రయాణం మొదలు పెట్టింది.

నేనెందుకిలా కదిలి పోతున్నానో అర్థం కావడం లేదు. ఒకోసారి ఒక చిన్న అల జడే భూకంపానికి కారణమౌతుంది. నా పేరేమిటంటే, ఎలా చెప్పేది? సంవత్సరాల జీవితం నా ముందు పరుచుకుంటూ రావడం మొదలైంది.

నాకు పువ్వులన్నా నవ్వులన్నా ఇష్టం. హాయిగా వుండటం, స్వేచ్ఛగా బతక్కలగడం, సాహిత్యాన్నంతా చదువుకోవడం, సైగల్ పాటలు, భానుమతి పాటలు, రవి శంకర్ సితార్ వాయిద్యం, చిట్టిబాబు వీణ, ముఖేష్ విషాద గీతాలు, రవివర్మ చిత్రాలూ, చలం నవలలూ, జాలాది జానపద పాటలూ, శ్రీశ్రీ కవిత్వం ఇలా ఎన్నెన్నో ఇష్టాలు నాలో...

నేను వుట్టడమే ఒక పెద్ద ప్రశ్నలా వుట్టాను. నాకు 'నాన్న' అనబడే దొరకు ఊరంతా భయపడేవారు. నాన్నకు ఆడవాళ్లంటే చాలా చులకన. నేను వుట్టానని తెల్సేక, అమ్మను చూసిన చూవు ఈ జన్మలో మరవలేనంటుందమ్మ. తనకు వంశాంకురాన్ని కాక, ఆడదాన్ని కన్నందుకు, మా నాన్నకు నాకు పేరు పెట్టే తీరికా, ఇష్టమూ లేకపోయాయి.

అమ్మ నన్ను 'బంగారం' అని పిల్చుకునేది. అంతా "చిన్నమ్మాయిగారూ" అనే వాళ్లు. లోహం లాంటి జీవితంలో ఎంత తగలబడ్తానో అమ్మ వూహించి వుంటే బహుశా ఆ పేరుతో అంత ముద్దుగా పిల్చుకునేది కాదేమో. అమ్మమ్మ వాళ్లు 'చిట్టీ' అనే వాళ్లు. ఇంత కురచ పేర్లెందుకో మరి.

మా ఊరికీ, పొరుగూరికి వచ్చిన గొడవల్ల తలమునకలౌతున్న రోజులు. నాన్నకు పదవి పంచప్రాణాలు. అధికార పార్టీలో తన ఆధిపత్యం స్థిరీకరించుకోవడానికి సంధి కుదుర్చుకోవాల్సి వచ్చింది. 'ఏమిద్దామా' అని అటూ ఇటూ చూసుకున్నట్టున్నాడు. పక్కనున్న వాళ్లు యిచ్చిన సలహా అద్భుతంగా అన్పించింది.

నాన్న నా పదహారేళ్ల జీవితంలో ముఖాముఖీ మాట్లాడిన మొదటి రోజది.

"ఏయ్! ఇలా రా!"

నన్నేనా? ఆశ్చర్యంగా చూశాను.

"వచ్చే శుక్రవారం నీకు పెళ్లి"

మనుషులు ఎందుకింత కర్కశంగా వుంటారో పొడిగా వుంటారో నాకెప్పటికీ అర్థం కాదు.

వరండాలోంచి నాన్న గొంతు విన్పిస్తోంది. "అమ్మాయి పేరేమిటి? అంటున్నావా? ఆడదానికి పేరెందుకండీ– అయినా నాకంత తీరిక లేక పెట్టలేదు కూడా– జాతకాల ప్రకారం పేరుండాలంటున్నారు కదా! మీ యిష్టమొచ్చింది పెట్టుకోండి. మీదే కదా ఇక"– చాలా నిర్లక్ష్యం ఆ స్వరంలో.

నేనొక వస్తువునా!!! ఎవర్నేను. నాకు సంబంధించిన అన్ని విషయాలు ఇలా నిర్ణయింపబడి పోతుంటాయా?

నాన్న తన స్థాయికి తగ్గట్టు అట్టహాసంగా పెళ్ళి చేశారు. నా ఒంటి మీదున్న బంగారాన్ని చూసి కొందరి కళ్లల్లో ఈర్ష్యాసూయలు. నా అందాన్ని చూసి ఆశ్చర్యం. ముళ్ళ కిరీటాలను నా ఒంటి నిండా చుట్టుకున్నట్లుంది.

పెళ్లయింది. ఇల్లు మారింది. స్థలం మారిందే కాని జీవన విధానం మారలేదు. అతగాడికి ఈ పెళ్లి ఏమాత్రం ఇష్టం లేదు. వాళ్ల నాన్నకు ఒరిగే పార్టీ లాభం కోసం చేసుకున్నాడు. ఆ ఊర్నిండా అతనికి అనేకమంది ఆడవాళ్లున్నారు. అన్ని అలవాట్లూ వున్నాయి. ఎన్నికల హడావుడిలో అతగాడు నాతో పెళ్లయిన విషయమే మర్చిపోయాడు.

నా చేతిలోని శుభలేఖపై 'సుచరితాదేవి' అన్న అక్షరాలు– అంటే, ఇకపై నా జీవిత విధాన క్రమాన్ని కుటుంబ గౌరవాన్నీ, నా ఒద్దికనూ తెల్పే ఆ అక్షరాలు ఈ శరీరానికి గుర్తులన్నమాట.

కాస్త తీరిక దొరికిన రోజు– నేనందంగా కనబడటంతో అతడికి నాపై వున్న హక్కు గుర్తొచ్చింది. ఏం జరుగుతుందో తెల్సే లోపల నేను తునాతునకలయ్యాను. నా శరీరం అతగాడికి ఆట బొమ్మైంది. నామీదా, నా శరీరం మీదా మొట్ట మొదటిసారిగా రోత వుట్టింది.

రాజకీయాలు నిమిషంలో మనిషిని మార్చే స్తాయి. అతడి అలవాట్లు, వ్యసనాలు, దర్పాలూ అన్నీ కలిసి దండెత్తి అతడ్ని సామాన్యుడ్ని చేశాయి. పల్లెలో బతకలేని అతడు పట్నానికి మకాం మార్చేశాడు. ఈ లోవుగా ఉదారంగా నాకో నలుగురు పిల్లల్ని దానం చేశాడు. వుట్టెడు రోగాలతో అతడు.

నేను కోల్పోయిన బాల్యం, ప్రేమ, ఆలనా–పాలనా, నా పిల్లల కివ్వాలని ఎన్నో యుద్ధాలు చేశాను. పోరాడాను. అలసిపోయాను. రక్త సిక్త గాయాలనేకం. నా దురదృష్టం నలుగురూ మగ పిల్లలే. తండ్రికి ట్రూ కాపీలే. నేనెంత వాళ్లని ప్రేమిద్దామనుకున్నానో వాళ్లకి అర్థం అయ్యేది కాదు. పిల్లల్ని కూర్చోబెట్టుకొని, జమీందారీ స్థాయిలో తాగుడు నేర్పడం, అలవాట్లు ఉండాలనడం, మగతనవు గొప్పదనాన్ని తెలియజెప్పడం, ఏ రకవు పెంపకమో, సంస్కారో అర్థమయ్యేది కాదు. భరించలేక పోయేదాన్ని.

అతడితో నేను పడుతున్న శారీరక హింసల్ని చూసేమో ఓసారి మృత్యువొచ్చి తీసికెళ్లిపోయింది. అతడి శరీరం కదలకుండా వుండడం చూసిన నాలో ఏ కదలికా రాలేదు. అందరికీ ఆశ్చర్యం. ఒక్క కన్నీటి బొట్టన్నా రాలేదని– అసలు నాలో అనుభూతుల చెలమ వుంటే కదా!

నలుగురూ పిల్లలూ నా నుంచి దూరమైపోయారు. ఎవరికీ నా అవసరం లేదు. ఎక్కడెక్కడున్నారో కూడా తెలీదు. నిజంగా– నేనీరోజు కొత్తగా ఒంటరిదాన్ని కాలేదనిపిస్తోంది. నేను మొదట్నించీ ఒంటరిదాన్నే– ఒంటరి తనంలోనే చిన్నప్పట్నించీ అలమటించీ, అలమటించీ అలిసిపోయాను. ఈ శరీరానికి జరిగిన పెళ్లి, పిల్లలు, కులం, ధనం ఇవేమీ నన్నంటుకోలేదు. ప్రతీసారీ నేను బ్రతకడానికే ప్రయత్నిస్తున్నాను. పోరాడుతూనే వున్నాను.

కాకపోతే. ఈ యాభైఏళ్ల వయస్సు నా దగ్గరికొచ్చేక, నాపై పెత్తనాలు లేని ఒక స్వేచ్ఛా జీవితం వచ్చింది.

ఒక చిన్నపాటి ఉద్యోగం, నాకు ఒక వూట తిండికి హాయిగా సరిపోతుంది. నాదైన చిన్న గది. ఆ గదిలో నేనూ, నా పుస్తకాలు, సంగీతం, ఏ అడ్డంకులూ, అధికారాలు లేని వాతావరణం ఇదీ ఇప్పటి నా జీవితం.

ఈ కాస్త ఊపిరి నాకు నేనుగా తీయడానికి నా శరీరంపై జరిగిన సంవత్సరాల యుద్ధం తర్వాత దొరికిన శాంతి ఇది.

నిజానికి, నాకు చాలా అందమైన పేరు పెట్టుకోవాలని ఉండేది. ఎవ్వరికీ లేని పేరు– ఆ పేరు వినగానే ఒక మెరువు మెరిసినట్లు, వాన కురిసినట్లు, జలపాతం పొంగినట్లు, సంగీతవు తునక చిలకరించినట్లు, ఒక జ్యోతి కురిసినట్లు, ఒక వెలుగు ఉబికినట్లు ఉండాలని– నన్ను నిర్లక్ష్యం చేసిన మనుషులు, సమాజం మీద తిరుగుబాటుగా నా పేరు నేనే పెట్టుకోవాలనుకున్నాను.

బస్ చివరి గమ్యస్థానానికి చేరి ఆగింది. కండక్టర్ అదువులో నా ఆలోచనల స్రవంతి ఆగింది. బస్ దిగి, నా కుటీరానికి చేరుకున్నాను.

రాత్రయింది. చాలా దిగులుగా వుంది. ఉదయం నుంచి మనస్సులో కురుస్తున్న జ్ఞాపకాల వర్షంతో తడి తడిగా వున్నాను. వణుకుతున్న చేతుల్తో నా డైరీలో, నా కిన్నాళ్ళూ నాలోనే వుండిపోయి, నన్ను నేను పిల్చుకుందామని అనుకుంటున్న నా పేరును రాయడానికి బియ్యవు పళ్లెంలో కాక, గులాబీ కాగితంలో రాద్దామని మొదలు పెట్టాను.

భరించలేని ఉద్వేగం, కళ్లు నీటి కుండలయ్యాయి. చెయ్యి గజిబిజిగా ఒణుకుతోంది. ఉన్మత్తురాలి నౌతున్నాను. సన్నటి నొప్పి గుండె అంచుల్నించి ఒరుసుకుంటూ వచ్చింది. రాస్తున్న అక్షరం మొదలౌతూనే చేతిలోని పెన్ను జారుతోంది. నా శరీరం మట్టిలో కల్సిపోతుందిక అని తెలుస్తోంది. నా చివరి కోరిక తీరకుండానే ఇలా...

### దున్నిపారేస్తున్న గోవిందా

గోవిందా పేరెత్తితేనే కొత్త హీరోయిన్లు అమ్మో అంటున్నారట...రవీనాటండన్, కరిష్మాకవూర్, రాణీ ముఖర్జీ ఇలా కొంచెం ఎత్తువళ్లాలు బాగున్న ఏ పిల్లయినా కంటపడిందో తన నిర్మాతలకి ఫోన్లు చేసి వాళ్ళని తమ సినిమాలో బుక్ చేయించి పారేస్తున్నాడు. దాంతో పోన్లే సినిమా ఇప్పించాడన్న కృతజ్ఞతతో గోవిందా ఏమడిగినా అరిగిపోతుందా, తరిగిపోతుందా అని కళ్ళు మూసుకుని కానిమ్మంటున్నారట.



